

కొలామి భాషకు అక్షర సేద్యం

కాలానుగుణంగా తమ భాష, సంస్కృతి ఎక్కడ కనుమరుగవుతుందేమోనన్న తపనతో ఆదివాసీ కొలాం యువత ముందడుగు వేసింది.

8లో▸

ముగిసిన ప్రత్యేక ఓటరు నమోదు

కైలాస్‌నగర్: ఈనెల 2, 3వ తేదీల్లో జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ముగిసింది. ఆదివారం సెలవు రోజైనప్పటికీ బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. వీటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి జాబితాలో నమోదు చేయనున్నారు. అక్టోబర్ 4న తుదిజాబితా ప్రకటించనున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలెందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు డీఈవో ప్రణీతకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, అన్ని క్యాడర్లకు సంబంధించిన ప్రమోషన్ సీనియారిటీ లిస్టును తప్పులు లేకుండా వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోరారు. ప్రత్యేక కేటగిరి ఉపాధ్యాయులకు అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. బదిలీ దరఖాస్తు చేసుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను, అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు డీఈవో కార్యాలయంలో కమిటీ, ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బోనమెత్తి 'సమగ్ర' నిరసన



అమ్మవారికి బోనాలు సమర్పించిన సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రతిరోజు వినూత్న రీతిలో నిరసనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆరో రోజు ఆదివారం బోనాలెత్తి తమ నిరసన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ మనస్సు కరిగేలా చూడాలని స్థానిక డైట్ కళాశాల సమీపంలోని పోచమ్మ ఆలయంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఇందులో సమగ్ర శిక్ష సిబ్బంది రవిందర్, అనురాధ, దీప్తి, కవిత, వెంకట్, హిమబిందు, మీనకుమారి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ షురూ

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. బదిలీల కోసం ఉపాధ్యాయులు గతంలోనే వెబ్‌ఆప్షన్ ఇచ్చిన విషయం విదితమే. అయితే కొంతమంది న్యాయస్థానానికి ఆశ్రయించడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. తాజా గా హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. గత ఫిబ్రవరిలో ఆప్షన్లు ఇచ్చిన వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించడంతో వారు ప్రస్తుతం ఎడిట్ చేసుకుంటున్నారు. ఈనెల 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు ఉంది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు.

'నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం'



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: నిరుద్యోగుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి లంక రాఘవులు ఆరోపించారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, అధిక ధరలు నియంత్రించాలని కోరుతూ ఆదివారం ఉట్నూర్ అంగడిబజార్‌లో పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం గరిష్ట స్థాయికి చేరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పూసం సచిన్, మండల నాయకులు నాగోరావు, సునీల్, నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల్లో..స్పోర్ట్స్



జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాల

- ఆటల బడిపై అలసత్వం
- అధ్వానంగా క్రీడా పాఠశాల నిర్వహణ
- పర్యవేక్షణను గాలికొదిలిన అధికారి
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఆదిలాబాద్: ప్రతిభగల క్రీడాకారులను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటేలా రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో విద్యార్థులకు విద్యతో పాటు వారికి ఆసక్తి గల క్రీడాంశాల్లో ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాలల తరచూ వివాదాలకు కేంద్రబిందువుగా మారుతోంది.

విద్యా బోధనలో నిర్లక్ష్యం..

క్రీడా పాఠశాలలో ప్రత్యేకంగా ఉపాధ్యాయులను కేటాయించకుండా ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న వారిని డిప్యూటేషన్ కింద కేటాయిస్తున్నారు. దీంతో విద్యా బోధనపై సదరు ఉపాధ్యాయులు అంతగా శ్రద్ధ చూపడం లేదనే విమర్శలూ లేకపోలేదు. కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు స్థానికంగా పలుకుబడి ఉన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల అండదండలతో పైరవీలు చేస్తూ డిప్యూటేషన్ల మీద ఇక్కడికి వస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంలో బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు కలెక్టర్‌కు విన్నవించగా ఆయన ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతోకు విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసే వరకూ విషయం వెళ్లడం గమనార్హం. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగానే క్రీడా పాఠశాలలోని ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

తూతూమంత్రంగా క్రీడా శిక్షణ..

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది ఈ క్రీడా పాఠశాల దుస్థితి. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు సత్తా చాటేలా అర్హులైన నైపుణ్యం గల క్రీడా శిక్షకులను నియమించాల్సి ఉంది. అయితే ఇక్కడ కేవలం సాట్స్ ద్వారా నియామకమైన ఒకే ఒక కోచ్ విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. ఇక్కడ ఎస్జీటీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు బ్యాడ్మింటన్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులను లైంగికంగా వేధించాడనే కారణంతో ఓ అథ్లెటిక్స్ కోచ్‌ను సస్పెండ్ చేయడంతో ఆయన స్థానం ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అలాగే ఇక్కడ బాక్సింగ్ ట్రైనర్‌గా వ్యవహరించిన ఓ శిక్షకుడు ప్రస్తుతం హకీంపేట క్రీడా పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడి అధికారుల ఒత్తిడి కారణంగానే ఆయన స్వచ్ఛందంగా అక్కడకు వెళ్లారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన ఇక్కడ విధులు నిర్వర్తించిన సమయంలో ఈ క్రీడా పాఠశాల విద్యార్థులు ఎన్నో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు కైవసం చేసుకోవడం విశేషం.

చోద్యం చూస్తున్న అధికారి...

ఇంత జరుగుతున్నా పాఠశాలను పర్యవేక్షించాల్సిన అధికారి చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఓ శిక్షకునిపై లైంగిక ఆరోపణలు వచ్చినా.. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నా సదరు అధికారి ఆ విషయాన్ని మొదట్లో కప్పి ఉంచే ప్రయత్నం చేశారని ఆరోపణలున్నాయి. మీడియాకు తెలియడంతో విచారణ చేపట్టి కలెక్టర్‌కు హడావుడిగా నివేదిక పంపినట్లు సమాచారం. ఇటీవల ఆరో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిన విషయాన్ని బయటకి పొక్కకుండా సదరు అధికారి ఎన్నో ప్రయత్నాలు చేశారు. విషయం బయటకు తెలియడంతో సదరు విద్యార్థిని ఇంటికి పంపించివేశారు. ఈ ఘటన బహిర్గతం అవడంతో సదరు అధికారి క్రీడా పాఠశాల, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సిబ్బందితో రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సిబ్బందికి మీడియాకు సమాచారం ఇవ్వకూడదనే మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

విద్యార్థులతో చాకిరీ...

విద్యార్థులకు నాణ్యమైన చదువు, క్రీడా శిక్షణను అందించాల్సిన అధికారులు, సిబ్బంది వారితోనే పనులను చేయిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఇక్కడ అథ్లెటిక్స్ శిక్షకునిగా వ్యవహరించిన వ్యక్తి తన ఇంటి పనులను విద్యార్థులతో చేయించడం, తన పిల్లలను విద్యార్థులతో ఆడించడం అప్పట్లో వివాదానికి కారణమైంది. అంతే కాకుండా క్రీడా పాఠశాల డార్మెంటరీలో అవసరమైన సరుకులను విద్యార్థులతో మోయిస్తున్నారనే ప్రచారం ఉంది. అలాగే ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఎటువంటి క్రీడా పోటీలు జరిగినా పాఠశాలలోని విద్యార్థులతో చాకిరీ చేయిస్తున్నారనేది బహిరంగ రహస్యం అనేది పలువురు చర్చించుకుంటున్నారు.



ఆరోపణలు అవాస్తవం

క్రీడా పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేవు. స్పోర్ట్స్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలు అవాస్తవం. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూసుకుంటున్నాం. – వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో

కుష్ఠు లెక్క తేలింది



కుష్ఠు వ్యాధి సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారులు(ఫైల్)

- సర్వేలో ఎనిమిది మందికి నిర్ధారణ
- 1,209 మంది అనుమానితుల గుర్తింపు
- వీరికి పీహెచ్‌సీల వారీగా వైద్య పరీక్షలు
- వ్యాధిగ్రస్తులు వంద వరకు పెరిగే అవకాశం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కుష్ఠు విస్తరిస్తోంది. అంటు వ్యాధి కావడంతో రోజురోజుకు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. గతనెల 16 నుంచి 31 వరకు జిల్లాలోని ఆయా పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆశ కార్యకర్తలు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులందరికీ పరీక్షలు నిర్వహించారు. అనుమానితులను గుర్తించి వారి పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ వివరాలను సంబంధిత పీహెచ్‌సీల వైద్యాధికారులకు అందజేశారు. ఈ సర్వేలో జిల్లా వ్యాప్తంగా 1,209 మందిని అనుమానితులుగా గుర్తించగా, 12 మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. అనుమానితులకు వైద్య పరీక్షలు చేసేందుకు వైద్యారోగ్య శాఖాధికారులు సమాయత్తం అవుతున్నారు. రోజుకు మూడు నుంచి నాలుగు పీహెచ్‌సీల పరిధిలో వారికి పరీక్షలు నిర్వహించనున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా వ్యాధిగ్రస్తుల సంఖ్య వంద వరకు చేరే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎనిమిది మందికి నిర్ధారణ..

జిల్లాలో ఇటీవల నిర్వహించిన సర్వేలో ఎనిమిది మందికి వ్యాధి సోకిందని అధికారులు నిర్ధారించారు. ఆదిలాబాద్‌రూరల్ మండల పరిధిలోని అంకోలి పీహెచ్‌సీలో 3, జైనథ్ పీహెచ్‌సీ పరిధిలో 2, నేరడిగొండ పీహెచ్‌సీ పరిధిలో 2, ఇచ్చోడ పీహెచ్‌సీ పరిధిలో 1 చొప్పున వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరి నుంచి వారి కుటుంబ సభ్యులు, ఇతరులకు వ్యాధి సోకకుండా చర్యలు చేపడుతున్నారు. అయితే గతేడాది జిల్లాలో 55 మంది వ్యాధిగ్రస్తులు ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 63కు చేరింది.

పెరిగిన అనుమానితులు..

జిల్లాలో ఆయా పీహెచ్‌సీల పరిధిలో 1,209 మందిని అనుమానితులుగా గుర్తించారు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టగా వ్యాధిలక్షణాలు కలిగిన వారి వివరాలను పీహెచ్‌సీలో అందించారు. అత్యధికంగా జైనథ్ మండలం గిమ్మ పీహెచ్‌సీ పరిధిలో 179 మంది, నార్నూర్ పీహెచ్‌సీ పరిధిలో 100, సిరికొండ మండలం నర్సాపూర్(టి) పీహెచ్‌సీ పరిధిలో 60 మంది అనుమానితులు ఉన్నారు. బేల పీహెచ్‌సీ పరిధిలో 92 మంది, గుడిహత్నూర్, ఇచ్చోడ పీహెచ్‌సీల పరిధిలో 50 చొప్పున, సొనాల పీహెచ్‌సీ పరిధిలో 53 మంది, మిగతా పీహెచ్‌సీల పరిధిలో 20 నుంచి 50 వరకు అనుమానితులు ఉ న్నారు. కాగా జిల్లాలోని 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,024 మంది అనుమానితులు ఉండగా, ఆదిలాబాద్ పట్టణంలోని హమాలీవాడలో 68 మంది, చిల్కూరిలక్ష్మీనగర్‌లో 38 మంది అనుమానితులు ఉన్నారు. ఐదు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 185 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

సర్వే పూర్తయింది..



కుష్ఠు గుర్తింపులో భాగంగా జిల్లాలో గత నెల 16 నుంచి 31 వరకు ఇంటింటి సర్వే చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మందికి వ్యాధి నిర్ధారణ అయింది. 1,209 మందిని అనుమానితులుగా గుర్తించాం. వారికి ఆయా పీహెచ్‌సీల్లో ల్యాబ్ టెక్నీషియన్లు, డీపీవోల ద్వారా వైద్య పరీక్షలు జరిపి వ్యాధి సోకిందా.. లేదా అనే విషయాలను తేల్చడం జరుగుతుంది. వ్యాధి ముదురక ముందు గుర్తించి మందులు వాడితే త్వరగా నయం అవుతుంది.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

పంటలకు జీవం

- ఎట్టకేలకు కరుణించిన వరుణుడు
- జిల్లాలో మోస్తరు వర్షం
- తలమడుగులో అత్యధికం.. భీంపూర్‌లో అత్యల్పం



తాంసి మండలం వడ్డాడి శివారులో పచ్చదనంతో కళకళలాడుతున్న పత్తి చేను

కైలాస్‌నగర్: నెల రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ ఉపరితల అవర్తనంతో జిల్లాలో మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి ఆదివారం వరకు జిల్లాలో 10.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తలమడుగు మండలంలో 31మి.మీ., అత్యల్పంగా భీంపూర్ మండలంలో 1.5 మిల్లీ మీటర్లు పడింది. చెరువులు, ప్రాజెక్ట్‌ల్లోకి వరదనీరు వచ్చి చేరుతోంది.

పంటలకు జీవం

ఆగస్టులో నెల పాటు వర్షాలు కురవకపోవడం, ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో పంటలు మాడిపోయే పరిస్థితి తలెత్తింది. సాగునీటి వసతి కలిగిన రైతులు స్ప్రింకర్ల ద్వారా నీటిని అందిస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేశారు. వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేసే రైతులు ఆకాశంవైపు దీనంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి. చినుకు జాడ లేకపోవడంతో పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశముందని అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం పూత, కాతదశలో ఉన్న పత్తి, సోయా పంటలకు జీవం పోసినట్లైందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. నేలలో తేమ శాతం పెరిగి మొక్కలు ఎదిగేందుకు ఉపకరించినట్లుగా చెబుతున్నారు. అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొద్ది రోజులుగా ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు ఈ వర్షాలకు వాతావరణం చల్లబడి ఉపశమనం లభించినట్లైంది.

'మత్తడి వాగు'కు వరద..

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టులోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం పూర్తిస్థాయికి చేరువైంది. ఇన్‌ఫ్లో పెరిగితే రాత్రిపూట ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఏఈ హరీష్‌కుమార్ తెలిపారు.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు(మిల్లీమీటర్లలో)

మండలం	వర్షపాతం
భీంపూర్	1.5
జైనథ్	7.6
బేల	5.2
గాదిగూడ	4.2
నార్నూర్	8.0
ఇంద్రవెల్లి	4.4
గుడిహత్నూర్	5.0
ఆదిలాబాద్ రూరల్	7.9
ఆదిలాబాద్ అర్బన్	10.0
మావల	9.6
తాంసి	4.2
తలమడుగు	31.2
బజార్‌హత్నూర్	15.1
బోథ్	8.8
నేరడిగొండ	4.9
ఇచ్చోడ	2.4
సిరికొండ	28.2
ఉట్నూర్	24.3

మత్స్య.. ముహూర్తం ఖరారు

- రేపటి నుంచి జలాశయాల్లోకి చేపపిల్లలు విడుదల
- సర్వం సిద్ధం చేసిన మత్స్యశాఖ
- నెలాఖరులోపు పూర్తిచేసేలా ప్రణాళిక

జిల్లాలోని ప్రాజెక్టులు : సాత్నాల, మత్తడివాగు, దేగామ
జిల్లాలోని చెరువులు: 232
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు: 78
సహకార సంఘాల్లోని సభ్యుల సంఖ్య: 4300

కైలాస్‌నగర్: జిల్లాలో 2023–24 సంవత్సరానికి గాను ఉచిత చేప పిల్లల సీడ్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 5నుంచి జిల్లాలోని ఆయా చెరువులు, ప్రాజెక్టులు, కుంటల్లో వాటిని వదిలేలా మత్స్యశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెలాఖరులోగా అన్ని చెరువులు, ప్రాజెక్ట్‌ల్లో చేప పిల్లలను వదలిలా జిల్లా మత్స్యశాఖ కార్యాచరణ ఇప్పటికే సిద్ధం చేసింది.

ఈ ఏడాది 1.23 కోట్ల చేప పిల్లలు..

మత్స్యకారులకు జీవనోపాధితో పాటు వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. జిల్లాలోని 236 చెరువులు, నాలుగు ప్రాజెక్ట్‌ల్లో కలిపి ఈ ఏడాది 1.23 కోట్ల చేప పిల్లలను వదలాలని నిర్ణయించారు. అలాగే 15లక్షల రోయ్య పిల్లలను సైతం వదలనున్నారు. వీటితో పాటు రైతులు తమ పంట పొలాల్లో తవ్వుకున్న చిన్నపాటి కుంటల్లోనూ వీటిని వదలనున్నారు. జైనథ్ మండలంలోని సాత్నాల, తాంసి మండలంలోని మత్తడి వాగు, బజార్‌హత్నూర్ మండలంలోని దేగామ, బోథ్ మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు, తలమడుగు మండలంలోని కజ్జర్ల, భీంపూర్ మండలంలోని అందర్‌బంద్‌లోని జెండాగూడ, ఉట్నూర్ మండలంలోని గోపాల్‌పూర్, జైనథ్ మండలం లక్ష్మీంపూర్ రిజర్వాయర్‌లో 80 నుంచి 100ఎంఎం సైజ్ గల చేపపిల్లలను వదలనున్నారు. వీటిల్లో కట్ల, రాహు, మృగాల వంటి మూడు రకాలను 40, 50, 10 నిష్పత్తి చొప్పున 90.60 లక్షల చేప పిల్లలను వదలాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇక మత్స్యాశాఖకు సంబంధించిన 232 చెరువుల్లో కట్ల, రాహు, బంగారు తీగ రకం పిల్లలను 35, 35, 30 నిష్పత్తి చొప్పున 33లక్షలు వదిలేలా ప్రణాళిక సిద్ధం చేశారు. గతేడాది 1.10 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ ఏడాది మరో 13లక్షల పిల్లలను అదనంగా పంపిణీ చేయనున్నారు.



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం (ఫైల్)

5వ తేదీ నుంచి పంపిణీ షురూ

జిల్లాలో చేపల సీడ్ పంపిణీ ప్రక్రియను ఈ నెల 5నుంచి ప్రారంభించాలని మత్స్యాశాఖ నిర్ణయించింది. జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్ట్‌లో తొలిరోజు ఎమ్మెల్యే జోగు రామన్న, కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా వాటిని విడుదల చేయనున్నారు. మరుసటి రోజు నుంచి జిల్లాలోని ఆయా చెరువులు, ప్రాజెక్ట్‌ల్లో వాటిని వదలనున్నారు. గతంలో రెవెన్యూ, వెటర్నరీ, మత్స్యశాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం గుత్తేదారును ఖరారు చేసేవారు. అయితే ప్రభుత్వం ఈ ఏడాది మత్స్యాశాఖ అధికారులకు ఆ బాధ్యతలు అప్పగించడంతో వారే కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ లక్ష్యం మేరకు చేప సీడ్‌ను సరఫరా చేసి వదులుతారా లేకుంటే గతంలో జరిగిన అక్రమాలనే పునరావృతం చేస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలా జరగకుండా యంత్రాంగం చేప సీడ్ పంపిణీ ప్రక్రియ పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని మత్స్యకారులు కోరుతున్నారు.

ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం..

జిల్లాలోని నీటి వనరుల్లో చేప పిల్లల సీడ్ వదిలేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 5నుంచి వాటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తున్నాం. తొలుత సాత్నాల ప్రాజెక్ట్‌లో విడుదల చేస్తాం. ఈ నెలాఖరులోపు జిల్లాలోని అన్ని ప్రాజెక్ట్‌లు, చెరువుల్లో వాటిని విడుదల చేసే ప్రక్రియను పూర్తి చేస్తాం. సీడ్ సరఫరాలో ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో సరఫరా అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

'డివిజన్' ఆందోళన ఉధృతం

- ఎన్నికల బహిష్కరణ దిశగా 'బోథ్' ప్రజలు
- దీక్షలు 50వ రోజుకు చేరినా స్పందించని ప్రభుత్వం
- ఇప్పటికే ముగ్గురు వార్డుసభ్యుల రాజీనామా
- ఎన్‌హెచ్44పై ధర్నాకు ప్లాన్

బోథ్: డివిజన్ సాధన కోసం బోథ్ ప్రజలు చేపట్టిన ఉద్యమం ఉధృతమవుతోంది. ఈమేరకు మండల కేంద్రంలో చేపట్టిన దీక్షలు 50వ రోజుకు చేరాయి. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనలు ఉధృతం చేసేందుకు సాధన సమితి సభ్యులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల బహిష్కరణ దిశగా అడుగులు వేస్తున్నారు.

50 రోజుకు దీక్షలు..

ఆదివారం నాటి దీక్షలో మండల కేంద్రానికి చెందిన వారియర్స్ యూత్ సభ్యులు కూర్చున్నారు. 50 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఈ ప్రాంతవాసులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే బాపూరావు సైతం డివిజన్ అంశాన్ని సీఎం కేసీఆర్‌తో ప్రస్తావిస్తానని తెలిపారు. దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. అలాగే ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంంధ్యారాణి పలుమార్లు మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు డివిజన్ సాధన సమితి సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే జాతీయ రహదారి 44పై పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. అంతేకాకుండా ఎన్నికలను సైతం బహిష్కరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



50వ రోజు దీక్షలో కూర్చున్న వారియర్స్ సభ్యులు

ఎమ్మెల్యే, ఎంపీ రాజీనామా చేయండి..

బోథ్ డివిజన్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, ఎంపీ సోయం బాపూరావ్ రాజీనామా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే మర్లపల్లి, బోథ్, నక్కలవాడకు చెందిన ముగ్గురు వార్డు సభ్యులు రాజీనామా చేశారు. ఇందులో ఇద్దరు మహిళా వార్డు సభ్యులు ఉండడం గమనార్హం.

బోథ్‌కు అన్ని అర్హతలున్నాయి

బోథ్‌ను డివిజన్ చేసేందుకు అన్ని అర్హతలున్నాయి. గతంలో తాలుకా ప్రాంతంగా వెలుగొందిన చరిత్ర ఉంది. ప్రస్తుతం అదిలాబాద్ వెళ్లాలంటే దాదాపు 60 కి.మీ ప్రయాణించాలి. బోథ్‌లోనే డివిజన్ ఏర్పాటు చేస్తే మండల కేంద్రంతో పాటు చుట్టు పక్క మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నాం. ఎన్నికల లోపు బోథ్‌ను డివిజన్‌గా ప్రకటించాలి.

– మెర్గు భోజన్న, బోథ్

క్లుప్తంగా

ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు



అవార్డు అందుకుంటున్న కిషన్

ఖానాపూర్: నల్గొండకు చెందిన పుడమి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అందజేసిన 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని' మండలంలోని పాత ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వి.కిషన్ అందుకున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో భక్త రామదాసు వారసుడు శ్రీనివాసరావు తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందజేశారు. కార్యక్రమంలో పుడమి సాహితీ సంస్థ ఫౌండర్ బాల్‌రెడ్డి ఉన్నారు.

సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న డాక్టర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన క్లాం భూమారెడ్డి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ క్లాం వెంకట్‌రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు 50 సైకిళ్లను ఆయన సతీమణి డాక్టర్ క్లాం జీవిత వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జన్మదినం సందర్భంగా పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు క్లాం జయ శ్రీ, భూమారెడ్డి, వైద్యులు, విద్యార్థులు ఉన్నారు.

జీవోకు చట్టబద్ధత కల్పించాలి

ఉట్నూర్‌రూరల్: జీవో నంబర్.3కు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో ఆదివాసీ గిరిజన ఉపాధ్యాయ సంఘ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రాథోడ్ గణేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో జీవో నంబర్ 3 ప్రకారం స్థానిక గిరిజనులకు అవకాశం కల్పించాలన్నారు. నాయకుల జగన్నాథ్‌రావు, టీపీటీఎఫ్ నాయకులు వెడ్మ శ్యాంరావు, హెచ్‌డబ్ల్యూవో సంఘ ప్రధాన కార్యదర్శి అమిత్ చౌహాన్, రవీందర్, రామారావు, కృష్ణ, కైలాస్, వామన్‌రావు ఉన్నారు.

నిందితుల రిమాండ్

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన గొంద్ర సంజయ్ టాటా ఏస్ వాహనం, రాంపూర్ గ్రామానికి చెందిన చిన్నోల్ల నర్సయ్య ట్రాక్టర్ కల్టివేటర్లను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఆదివారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం నర్సాపూర్(జి) బస్టాండ్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇరువురిని పట్టుకుని విచారించారు. చాక్‌పల్లి గ్రామానికి చెందిన కరెండ్‌వార్ గణేష్, వానల్‌పాడ్ గ్రామానికి చెందిన జాదవ్ బాలాజీ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించి వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

కొలామి భాషకు అక్షర సేద్యం



కొలామి వికీపీడియాలో నెహ్రూ సమాచారం



కొలామి వికీపీడియాలో మీరాబాయి చాను సమాచారం

- అంతరించకుండా యువత కృషి
- వికీపీడియాలో కొలామి భాష
- సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు..
- భాష సంరక్షణకు పాట్లు

ఉట్నూర్‌రూరల్: ఆధునిక కాలంలో కాలానుగుణంగా తమ భాష, సంస్కృతి ఎక్కడ కనుమరుగవుతుందేమోనన్న తపనతో ఆదివాసీ కొలాం తెగ యువత ముందడుగు వేసింది. కొలామి భాష, తమ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఆలోచనతో వికీపీడియాను వేదికగా ఎంచుకున్నారు. భవిష్యత్ తరాలకు తమ భాష, సంస్కృతి, పదజాలం, జానపద పాటలు, నృత్య కళారూపాలు, చారిత్రాత్మక అస్తిత్వ పరిరక్షణకు తమ వంతు పాత్ర పోషిస్తూ తెలుగు లిపితో కొలాం భాషను వికీపీడియాలో పొందుపరుస్తూ.. పలువురు మన్ననలు పొందుతూ కొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఇది వరకే ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఐటీడీఏ పీవో పాల్గొని కొలామి భాషను వికీపీడియా ద్వారా ప్రపంచానికి తెలియచేయడంపై ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి బోలిచేతో (భాష చైతన్యం) ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికీపీడియా శిక్షణ తరగతులు

కొలాం తెగకు చెందిన యువకులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని వెలికితీసి భాషను నేరుగా వికీపీడియాలోకి మార్చి తమ ఔనత్యాన్ని చాటుతున్నారు. కొలామి భాషతో పాటు మహనీయులు, క్రీడాకారులు, రాజకీయ నాయకుల చరిత్రను కొలామిలో పొందుపర్చేందుకు సిద్ధమవుతున్నారు.

కొలాం సంస్కృతి

గిరిజన తెగల్లో కొలాం సంస్కృతి, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. కొలాం ఆదివాసీలు కొలిసే ఆరాధ్యదైవం భీమయ్యక్, నడిదమ్ము, ముత్తేలమ్మ, దండారీ, దూరడి, పోలకమ్మ దేవతలు ముఖ్యమైనవి. వివాహ వేడుకల్లో పాడే జానపదులు ప్రత్యేకంగా ఉంటాయి. కొలాం మహిళలు, పురుషులు ఉత్సవాల సందర్భంగా కొలామి మాతృభాషలో పాడే పాటలు, నృత్య కళారూపాలను కాలానుగుణంగా వివిధ ఉత్సవాలకు సంబంధించిన నృత్యాలు సేకరించి పొందుపర్చనున్నారు.

వికీపీడియాలోకి..



తెలుగు లిపిని అలంబన చేస్తూ కొలామి భాషకు జీవం పోసి వందలాది వ్యాసాలతో ముందుకు సాగుతూ అంతర్జాతీయ వేదికగా నిర్మితమవుతున్న కొలామి వికీపీడియా అక్షర సేద్యంగా నిలువనుంది. కొలాం తెగ ప్రజలు రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్రలో యావత్మల్ జిల్లాలో నివసిస్తున్నారు. వీరిది ద్రావిడ భాష అయినా కొలామి భాషను మాట్లాడతారు. ప్రభుత్వ రికార్డుల్లో కొలామ్స్ అని నమోదు చేసింది.



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయి (ఫైల్)



ఫౌండేషన్, వికీపీడియా సభ్యులు

ఆదివాసీల్లో అత్యంత వెనుకబడిన తెగ...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 46,677 మంది కొలాం జనాభా ఉన్నారు. ఆదివాసీ తెగల్లో అత్యంత వెనుకబడిన తెగ ఆదివాసీ కొలాం. వారి సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ఉంటాయి.

కొలామి వికీపీడియా ప్రస్థానం

కొలామి వికీపీడియాను జూన్ 28న నేతి సాయికిరణ్ ప్రారంభించారు. ప్రపంచంలో లిపి లేని ఆదివాసీ భాషలు రోజురోజుకూ అంతరించిపోతున్నాయి. భాష పదజాలం కోసం సంస్కృతి పరిరక్షణకు బోలిచేతో ఫౌండేషన్ స్థాపించారు సాయికిరణ్. భాష కోసం, ఆదివాసీలు సంస్కృతిక పంటలైన చిరుధాన్యాల బాహ్య ప్రపంచానికి తెలియచేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

భవిష్యత్‌కు కొలామి వికీపీడియా అవసరం



తెలుగు వికీపీడియాలోని తెలంగాణలోని జిల్లాలు, మండలాలు, గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని కొలామి భాషలో అనువాదం చేస్తున్నాం. సమకాలిన అంశాలపై రచనలు కొనసాగుతున్నాయి. వికీ బుక్స్‌లో నేను రచించిన కొలాం వీరుడు కుమురం సూరు, దండారీ కైతికాలు, దంతన్‌పల్లి భీమయ్యక్ మహాత్మ్యం, మోతీరాము శతకం పుస్తకాలు పొందుపర్చుతాను.

– ఆత్రం మోతీరాం, కొలామి వికీపీడియా, కవి

మా జీవన విధానాన్ని వికీలో భద్రపరుస్తాం



మా కొలాం సంస్కృతికి సంబంధించిన వ్యవహారాలు, దేవుళ్లు, జానపద నృత్యాలు, పాటలు, మా చారిత్రాత్మక స్థానాలు, మా జీవన విధానం, పల్లెలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సేకరించి వికీ కామన్స్‌లో భద్రపరుస్తాను.

ఆత్రం రాజ్‌కుమార్, కొలామి వికీపీడియా

ఇష్టంతో అనువాదం



తెలుగు వికీపీడియాలోని సమాచారాన్ని కొలామి భాషలో అనువాదం చేయడం నాకెంతో ఇష్టం. జాతీయ నాయకులకు సంబంధించిన సమాచారాన్ని కొలామి భాషలో తెలుగు లిపితో అనువాదం చేస్తున్నాం. మా మాతృభాష కొలామి భాషకు సేవా చేయడం నాకెంతో గర్వకారణం.

– మడావి జంగు, కొలామి వికీపీడియా

అంతరిస్తున్న భాషలపై పరిశోధన



యునెస్కో ప్రకారం ప్రపంచంలో 7వేలకు పైగా భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ జాబితాలోని చాలా భాషలు అంతరిస్తున్నాయి. వైవిధ్యంగా ఉన్న భాషలు ప్రపంచ భాష వైవిధ్యతను కోల్పోయే దిశలో ఉన్నాయి. భాషను డిజిటల్ మాధ్యమాల ద్వారా పునరుద్ధరణ చేయడమే నా లక్ష్యం.

– నేతి సాయికిరణ్, తెలుగు వికీపీడియా, బోలిచేతో ఫౌండేషన్, వ్యవస్థాపకుడు, అస్సాం

మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం మహాసభను విజయవంతం చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం ద్వితీయ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల అశోక్ అన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లు ఆదివారం స్థానిక విశ్రాంతి భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ అధ్యక్షతన మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ద్వితీయ మహాసభ సమావేశాలు ఈనెల 6వ తేదీన బుధవారం సికింద్రాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరిస్తుందని ఇప్పటి వరకు కొన్ని జిల్లాల్లో కనీసం గుర్తింపు కోసం అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు కూడా ఇవ్వడం లేదన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకై నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల్లోని మున్నూరుకాపు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అందరు హాజరై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి వర్యులు గంగుల కమలాకర్, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు బండి సంజయ్, పొన్నాల లక్ష్మయ్య హాజరు అవుతారన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు ద్యావరశెట్టి మధు, జిల్లా కార్యదర్శి పెంట రంజిత్ కుమార్, సంతోష్, తాడిచెట్ల మధుకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం జిల్లా నాయకులు

రవీంద్రభారతిలో స్వామి లఘుచిత్రాల ప్రదర్శన

తాంసి: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జిల్లా నుంచి ఎంపికైనా పల్లె లఘు చిత్రాలను శనివారం రాత్రి ప్రదర్శించారు. రవీంద్రభారతిలోని పైడి జైరాజ్ థియేటర్‌లో ప్రదర్శనకు ఆదిలాబాద్ జిల్లా నుంచి మొదటగా మొత్తం 35లఘు చిత్రాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన చిత్రాలను సెప్టెంబర్‌లో ప్రతీ శనివారం రాత్రి ప్రదర్శించనున్నారు. శనివారం తాంసి మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన కర్నేవార్ స్వామి చిత్రీకరించిన సర్పంచ్ మొగుడు తోపు, కొంప ముంచిన కరోనా, ఆన్‌లైన్ క్లాసుల గోల లఘు చిత్రాలను ప్రదర్శించారు. థియేటర్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ లఘు చిత్రాలను నిర్మించిన వారితో కలిసి తిలకించి అభినందించారు. అనంతరం వేదికపై స్వామిని మామిడి హరికృష్ణ, నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రమేష్ కిషన్ గౌడ్, రత్నాకర్ తదితరులు ఉన్నారు.



స్వామిని సన్మానిస్తున్న తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు హరికృష్ణ

విద్యుత్‌వైర్లు తగిలి తాపీమేస్త్రి మృతి



శేఖర్ (ఫైల్)

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలో ఓ ఇంటిని నిర్మిస్తుండగా తాపీ మేస్త్రి కొలిపాక శేఖర్(33) 33కేవీ వైర్లు తగిలి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రాము వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలోని ధని గ్రామానికి చెందిన శేఖర్ బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామంలో రమేష్ ఇంటి నిర్మాణానికి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో స్లాబ్‌పై ఉన్న 33కేవీ వైర్లు తాపీకి తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే పడి మృతిచెందాడు. గమనించిన తోటి మేస్త్రీలు సీపీఆర్ చేసినా ఫలితం కానరాలేదు. వెంటనే బోథ్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సిరికొండ: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జింక నడ్పి మల్లేష్, ధనలక్ష్మి కుమారుడు జింక శ్రీకాంత్(19) శనివారం ఉదయం పంట పొలంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన తండ్రి స్థానికుల సాయంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మానసికస్థితి సరిగా లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృత్యుమార్గం.. 44 హైవే

- కుటుంబంతో వస్తుండగా గుంతలో పడిన బైక్
- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని భర్త మృతి
- భార్య, పిల్లలకు గాయాలు
- ప్రయాణంలో ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు
- నిర్మాణ లోపాలే కారణమంటున్న స్థానికులు



సుఖాచారి మృతదేహం



సుఖాచారి (ఫైల్)



కొడుకు మృతితో రోదిస్తున్న రుక్మిణిబాయి

గుడిహత్నూర్: 'అయ్యో బేటా.. నేనే మిమ్మల్ని విడిచి వెళ్తామని ఆ దేవున్ని మొక్కుకుంటున్నా.. నన్ను విడిచి ఎలా వెళ్లావురా? ఆ దేవుడికి న్యాయం తెలియదా? ఎంతో కష్టపడి నాకు వైద్యం చేయిస్తున్నావు.. నేను చచ్చేది.. నువ్వెలా చచ్చావురా.? అంటూ ఆ తల్లి రోదిస్తున్న తీరు అందరిని కలిచివేస్తోంది. మండల కేంద్రంలోని హనుమాన్ నగర్‌కు చెందిన సుఖాచారి (52) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇచ్చోడలోని బంధువుల ఇంటికి భార్య నీలాబాయి, ఇద్దరు కూతుళ్లు మహాలక్ష్మి, శివప్రియతో కలిసి మోటార్ సైకిల్‌పై ఆదివారం ఉదయం 11గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. ఆ సమయంలో వర్షం మొదలైంది.

మండలంలోని మన్నూర్, డోంగర్‌గావ్ మధ్యలో పెట్రోల్ పంపు సమీపంలో వర్షపు నీటితో నిండిన గుంతలను తప్పించే క్రమంలో గుంతలో బైక్ పడడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుఖాచారి తలకు తీవ్రగాయం కాగా భార్య నీలాబాయికి, చిన్నారులు శివప్రియ, మహాలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఓ కారులో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే సుఖాచారి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

ఇటీవల జరిగిన సంఘటనలు...

ఇటీవల మండలంలోని జాతీయ రహదారిపై చింతగూడ సమీపంలో తెల్లవారు జామున ఆటోలో ప్రయాణిస్తున్న వారిని లారీ ఢీ కొన్న ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. అలాగే నిర్మల్ జిల్లాలో గత ఆగస్టు 27న జరిగిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల నేరడిగొండ వద్ద జరిగిన ప్రమాదంలో బోథ్ మండలం కన్గుట్టకు చెందిన మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఇలా పలువురు మృత్యువాత పడడంతో పాటు గాయాలపాలవుతున్నారు. కానీ హైవే అథారిటీ స్పందించకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. వేగ నియంత్రణ సూచికలు లేకపోవడంతో పాటు హైవే నిర్వహణ సంస్థల నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రాణాలు తీస్తున్న హైవే..

ఇటీవల కురిసిన వర్షాలకు 44హైవేపై ఏర్పడిన గుంతలతో నేరడిగొండ నుంచి ఆదిలాబాద్ వరకు ఏదో ఒక చోట నిత్యం రోడ్డు ప్రమాదాలతో పలువురు ప్రాణాలు కోల్పోతుండగా మరి కొంత మంది గాయాలపాలవుతున్నారు. కాగా గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలను గుర్తించి జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సదరు కాంట్రాక్టు సంస్థతో చర్చలు జరిపి వెంటనే గుంతలు సరిచేయాలని హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వీరు గత పక్షం రోజుల నుంచి మావల బైపాస్ రోడ్డు నుంచి గుడిహత్నూర్ వైపు గుంతలు పూడ్చే పనులు చేపడుతున్నారు. అయితే పని జరుగుతున్న చోట మాత్రమే ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి పనులు జరుపుతున్నారు. మిగతా చోట్ల ఉన్న గుంతల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

మామడ: మండలంలోని బూరుగుపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం లారీ బోల్తా పడగా డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. నాగ్‌పూర్ నుంచి బెంగుళూర్‌కు ఆలుగడ్డల లోడుతో వెళ్తున్న లారీ భూరుగుపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అర్లి(కే) ఎక్స్‌రోడ్డు సమీపంలో..

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కే) ఎక్స్‌రోడ్డు సమీపంలో లారీ బోల్తాపడగా డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... చెన్నయ్ నుంచి జైపూర్‌కు క్లాత్ బిండల్స్, ట్రాక్టర్‌ను లారీలో తరలిస్తున్న క్రమంలో నర్సాపూర్(జి) మండలంలోని అర్లి(కే) ఎక్స్ రోడ్డు సమీపంలోని 61వ జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 3గంటల ప్రాంతంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి లారీ బోల్తా పడింది.

రెండు బైక్‌లు ఢీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామం టీవీటీ క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఉన్న ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్న అనిల్ సొనాలకు వెళ్తున్నాడు. సాకెర గ్రామానికి చెందిన రాజేందర్ సొనాల నుంచి సాకెర వెళ్తున్న క్రమంలో టీవీటీ క్రాస్ రోడ్డు వద్ద ఎదురెదురుగా ఒక్కసారిగా ఢీకొట్టుకున్నారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

వ్యక్తి అదృశ్యం

సారంగపూర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బోరిగాం గ్రామానికి చెందిన కోంద్ర మహిపాల్‌రెడ్డి(37) కనిపించడం లేదని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. వారి వివరాల ప్రకారం... గత నెల 11వ తేదీన మహిపాల్‌రెడ్డి ఉదయం లేవగానే పంటపొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేసేది లేక పోలీసులకు ఫిర్యాదు చేశారు.